పల్లెకు పయనం.. నరకప్రాయం



దుస్థితిలో కుక్కపల్లివారికండ్రిగ రోడ్డు



చవటకండ్రిగ గ్రామానికి వెళ్లే మార్గం

- ఏళ్ల తరబడి అధ్వానంగా రోడ్లు
- దారుణంగా పలు గ్రామాలను కలిపే మార్గాలు
- వర్షం వస్తే రోడ్లుపై ప్రయాణం అసాధ్యం

దొరవారిసత్రం: మండలం పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు (పంచాయతీరాజ్ శాఖ)మార్గాలు దారుణంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. వర్షాకాలంలో అయితే రోడ్లు అత్యంత దారుణంగా మారి ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ వాహనం కోసం ఫోన్ చేస్తే అధ్వానంగా ఉండే రోడ్డుపై రాలేమంటున్నారు. చివరికి ప్రైవేటు స్కూల్ వ్యాన్‌లు, బస్సులు కూడా రాలేని పరిస్థితి.

దుస్థితిలో రోడ్లు

డీవీ సత్రం మండల పరిధిలో 22 పంచాయతీల్లో 54 గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గం 35 కిలోమీర్లు విస్తరించి ఉంది. ఇందులో ముఖ్యంగా ఉచ్చూరు పంచాయతీ పరిధిలోని తిమ్మనాయుడుకండ్రిగ, పూలతోట పంచాయతీలోని చవటకండ్రిగ, తొగరాముడి, కొత్తపల్లి పంచాయతీలోని కలుజుమిట్ట, శ్రీధనమల్లి పంచాయతీలోని కుక్కపల్లివారికండ్రిగ, కుమ్మరిగుంట ఎస్టీ కాలనీ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు మార్గాలు దారుణంగా ఉన్నాయి. వర్షాకాలంలో పంట కాలువలు ఉధృతంగా ప్రవహిస్తే కొన్ని గ్రామాలకు రాకపోకలు సైతం స్తంభించిపోతాయి. ఈ ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో రోగులు పడే ఇబ్బందులు, ప్రజలు ఎదుర్కొనే సమస్యలు అన్నీఇన్నీ కాదు. ఈ ప్రాంతాలకు వెళ్లే మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చి రోడ్డు కష్టాల నుంచి బయట పడేయాలని గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కూడా లేవు

చినుకు పడితే తప్పని తిప్పలు

తిమ్మనాయుడుకండ్రిగ, చవటకండ్రిగ, కుక్కపల్లివారికండ్రిగ, కుమ్మరిగుంట గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాలు ఒక్కొక్క రోడ్డు రెండు కిలోమీటర్లు పొడవున విస్తరించి ఉంటుంది. వర్షాకాలం మొదలైందంటే ఈ గ్రామాల్లోని ప్రజలకు రోడ్డు కష్టాలు ప్రారంభమవుతాయి. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా తిరుగలేని స్థితి. తిమ్మనాయడుకండ్రిగ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో మూడు చోట్ల పంట కాలువలు ఉన్నాయి. వానల్లో ఈదల కాలువ, పంట కాలువలు దాట లేని పరిస్థితి.



తిమ్మనాయుడుకండ్రిగ రోడ్డుపై పారుతున్న ఈదల కాలువ

గతంలో రూ.20 లక్షలతో శ్లాబ్ కల్వర్టు

తిమ్మనాయుడుకండ్రిగ గ్రామంలో రెండేళ్ల కింట గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమయంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దృష్టికి రోడ్డు సమస్యను తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తన సొంత నిధులను రూ.20 లక్షలు కేటాయించారు. ఈదల కాలువపై, పంట కాలువలపై శ్లాబ్ కల్వర్టు నిర్మించే విధంగా టెండర్‌కు పిలిచారు. ఇంతలో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో ఈ కల్వర్టు నిర్మాణాలు నిలిచిపోయాయి.

108 వాహనం, స్కూల్ వ్యాన్ రావడంలేదు



తిమ్మనాయుడుకండ్రిగ గ్రామంలో అనారోగ్యానికి గురై అత్యవసర సమయంలో 108 వాహనం కోసం ఫోన్ చేస్తే గ్రామంలోకి రాలేమంటున్నారు. రోడ్డు దారుణంగా ఉండడంతో గ్రామంలోకి ప్రైవేటు స్కూల్ వ్యాన్ సైతం రావడంలేదు. ఒకవేళ వచ్చినా 108 వాహనం, స్కూల్ వ్యాన్ మావిళ్లపాడు-మంగానెల్లూరు రోడ్డుపైనే ఆపేస్తున్నారు. రోగులను, విద్యార్థులను వాహనాలు వద్దకు తీసుకువెళ్లడంలో ఇబ్బందులు తప్పడం లేదు. – కాశి చెంగయ్య, తిమ్మనాయడుకండ్రిగ గ్రామం

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



వర్షా కాలం వచ్చిందంటే గ్రామానికి వచ్చే రోడ్డు మార్గంలో మూడు దగ్గర్ల పంట కాలువలు పొంగి ప్రవహిస్తాయి. దీంతో కొన్ని నెలల పాటు రాకపోకలు కష్టంగా సాగుతాయి. గ్రామ సమీపంలో ఉన్న ఈదల కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం కూడా ఈదల కాలువ ప్రవహిస్తోంది. ఈ ఎండాకాలంలోనే రోడ్డు పనులు చేస్తే వర్షాలు వచ్చే సమయానికి ఉపయోగకరంగా ఉంటుంది. – కాశి కోదండయ్య, తిమ్మనాయుడుకండ్రిగ గ్రామం

వర్షం వస్తే గోతుల మయం



వర్షాలు కురిస్తే చవటకండ్రిగ గ్రామ రోడ్డు దారుణంగా ఉంటుంది. కనీసం వాహనాలు రావాలంటే పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు. కనీసం మరమ్మతులు చేపట్టమని అధికారులను, పాలకులను కోరినా ప్రయోజనం లేదు. అత్యవసర సమయంలో రోగులకు వైద్యం కోసం తరలించాలంటే పలు ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సమస్య ఎవరూ పట్టించుకోవడం లేదు. – మీజూరు సుబ్రమణ్యం, చవటకండ్రిగ గ్రామం

మేరిగను కలిసిన వైఎస్ఆర్ సీపీ నేతలు



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న బీవీ రమణయ్య

చిట్టమూరు: వైఎస్ఆర్ సీపీ గూడూరు నియోజక ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను మంగళవారం చిట్టమూరు మండలానికి చెందిన నాయకులు కలిశారు. మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన బద్దిగ వెంకటరమణయ్య మేరిగ మురళీధర్‌ను కలసి శాలువా, పూలమాలతో సత్కరించారు. వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యదర్శి పేట రాజీవ్ రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, గునపాటిపాళెం ఎంపీటీసీ సభ్యుడు ఫకీరయ్య, నాయకులు ఆళ శ్రీనివాసులు, తాడిమేడు మధు, వల్లిపి మల్లికార్జున, మాజీ సర్పంచ్ మణి పాల్గొన్నారు.

పోషకాహారంపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ అధికారులు పిల్లలకు అందించాల్సిన పోషకాహారంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమంలో భాగంగా టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించగా స్థానిక ఎంఈఓ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బాల్య సంరక్షణతోపాటు విద్యను అందించాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లలు పోషకాహారం అందించే విషయంలో ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, అంకమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గూడూరుకు చెందిన వీపూరు విజయ్ కుమార్, వసుంధర దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. చెక్కును ఆలయ ఏసీ, ఈఓ బి.ప్రసన్నలక్ష్మికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి మాజీ సభ్యుడు బైరి పార్థసారధిరెడ్డి, జనసేన పట్టణ అధ్యక్షుడు పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు పరామర్శ



బాలయ్యను పరామర్శిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): నెల్లూరులోని బొల్లినేని వైద్యశాల(కిమ్స్) అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్యను వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను బాలయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాలయ్యకు మెరుగైన వైద్యం అందించాలని బొల్లినేని వైద్యులకు సూచించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వినియోగించుకోండి

కోట: స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ఆర్ సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం కొత్తపాళెం గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, పద్మావతి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ బందిల ప్రసన్న, గాలి శ్రీనివాసులురెడ్డి, శానంపూడి గోపాల్‌రెడ్డి, ఏఎన్ఎం మాధవి పాల్గొన్నారు.

నట్టల నివారణకు వ్యాక్సినేషన్

దొరవారిసత్రం: మీజూరు, కారికాడు, వేలికాడు, కల్లూ రు, కల్లూరుకండ్రిగ గ్రామాల్లో మంగళవారం స్థానిక పశు వైద్య సహాయకులు దూడలు, పశువులకు నట్టల వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ చేశారు. అంతేకాకుండా పశువుల్లో సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీంతోపాటు మేకలు, గొర్రెల్లో నోటి పుండ్లు, మూతి వాపు తదితర వ్యాధులను పరీక్షించి వ్యాక్సిన్ చేశారు. వైద్య సహాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

సాక్షి ఎఫెక్ట్..

ఓజిలి: మండలంలోని పెదపరియ, చిలమానుచేను, రాజుపాళెం గ్రామాల్లో మిరప పంటను ఉద్యాన శాఖ అధికారి కె.శారద మంగళవారం పరిశీలించారు. మిరపకు తెగుళ్ల బెడద అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆమె ఉద్యానవన అధికారులతో కలసి మిరప పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటల పరిశీలనలో మిర్చి పంటకు పైముడత, కింద ముడత, వైరస్, బూడిద తెగులును గుర్తించామని తెలిపారు. ఈ తెగుళ్ల నివారణ కోసం రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట సిబ్బంది ప్రపూర్ణ తదితరులు ఉన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

పెళ్లకూరు: మండలంలోని టెంకాయతోపు గ్రామ సమీపంలో భార్య లక్ష్మీప్రియపై భర్త హేమంత్‌కుమార్ స్క్రూడ్రైవర్‌తో దాడి చేసిన ఘటనపై మంగళవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నాగరాజు కథనం మేరకు శ్రీకాళహస్తికి చెందిన గొడ్ల హేమంత్‌కుమార్ వైఎస్ఆర్ జిల్లా రైల్వేకోడూరుకు చెందిన పంతగాని లక్ష్మీప్రియని ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత కొంత కాలంగా భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో భర్త వేధింపులను తాళలేక లక్ష్మీప్రియ ఐదు మాసాల నుండి రైల్వేకోడూరులో ఉన్న తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. అయితే నాలుగు రోజులు కిందట అత్తమామలను బుజ్జగించి భార్యను శ్రీకాళహస్తికి తీసుకొచ్చి అద్దె ఇంటిలో వేరు కాపురం పెట్టాడు. సోమవారం భార్యతో గొడవపడి ఆమెపై దాడికి పాల్పడిన హేమంత్‌కుమార్ అసుపత్రికి తీసుకెళుతానని నమ్మించాడు. టెంకాయతోపు గ్రామ సమీపంలోని వ్యవసాయ కాలువ వద్దకు తీసుకొచ్చి వెంట తెచ్చుకున్న స్క్రూడ్రైవర్‌తో పలు చోట్ల ఆమెపై దాడి చేశాడు. దాంతో లక్ష్మీప్రియ కేకలు వేయడంతో అటుగా వెళుతున్న నలుగురు యువకులు అమెను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. అంతలో హేమంత్‌కుమార్ అక్కడ నుండి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

చిట్టమూరు: అరవపాళెం పంచాయతీ దరఖాస్తు గ్రామంలో మంగళవారం కుక్కలు దాడి చేయడంతో ఐదేళ్ల చిన్నారికి గాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు... గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు కుమార్తె చల్లా చాందిని సాయంత్రం తమ వీధిలో తోటి చిన్నారులతో కలసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో కుక్కల గుంపు ఒక్కసారిగా ఆడుకుంటున్న పిల్లలపై దాడి చేశాయి. దీంతో చాందిని చెవిని కుక్క కరిచి తీవ్రంగా గాయపరిచింది. చాందినిని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనతంరం గూడూరు వైద్యశాలకు తరలించారు.

నేడు వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలో బుధవారం వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. కొత్తగుంట గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరులో జరిగే యువత పోరు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. నెల్లూరు జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే యువత పోరును జయప్రదం చేయాలని కోరారు.

వెంకటగిరి(సైదాపురం): వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం నేదురుమల్లి నివాసం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఓజిలి: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీ జెండాను ఎగురవేసి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఉన్న క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం వైఎస్ఆర్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేటలో బుధవారం ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

మేరిగతో చిల్లకూరు నాయకుల భేటీ



ఎమ్మెల్సీతో చిల్లకూరు నాయకులు

చిల్లకూరు: మండలానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న ఎమ్మెల్సీ నివాసంలో ఆయన్ను చిల్లకూరుకు చెందిన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికైన నందవరం సుబ్బారావు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీని కలసిన వారిలో నాయకులు ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, ఆళ్ల రాజేష్‌కుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, కాటూరు శ్రీహరి, కొట్టు గురునాథం, మాతయ్య తదితరులు ఉన్నారు.

యువతపోరుకు తరలిరండి





కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ తదితరులు, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సైదాపురం: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే యుతవ పోరుకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు(యోగి) సోమవారం పిలుపునిచ్చారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు ఈ నెల 12వ తేదీన నెల్లూరు వీఆర్‌సీ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని తెలియజేశారు. వైఎస్ఆర్ సీపీ అనుబంధ విభాగాల కార్యకర్తలు, నాయకులు, విద్యార్థి, యువజన సంఘాలు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సైదాపురం: ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను ఘోరంగా మోసం చేసి నట్టేట ముంచిందని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ ఆరోపించారు. మండల కేంద్రమైన సైదాపురంలో మంగళవారం యువతపోరుపై నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం యువత పోరుకు మండలం నుంచి వందలాది మందితో నెల్లూరు వీఆర్‌సీ సెంటర్‌కు చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యువతపోరు కరపత్రాల ఆవిష్కరణ

చిల్లకూరు: వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుకు భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరును ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు.

దీనిని అమలు చేసే క్రమంలో వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన యువత పెద్ద ఎత్తున నెల్లూరు వీఆర్‌సీ సెంటర్ వద్దకు తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం ఇలా ఎన్నో పథకాలను అటకెక్కించారని, దీనిని అమలు చేసే వరకు పోరు బాట తప్పదన్నారు. వైఎస్ఆర్ సీపీ గూడూరు రూరల్, చిట్టమూరు మండలాల అధ్యక్షులు మల్లు విజయకుమార్ రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిఖిల్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నాయుడపేట టౌన్: వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సారథ్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున జరిగే యువత పోరు బాటతో నిరసనలు చేపట్టి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు రూరల్: రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో నివశిస్తున్న నాగిశెట్టి హరిబాబు కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని భార్య, ఇద్దరు పిల్లల పోషణ కష్ట తరంగా మారిందని తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి బాబు మాట్లాడుతూ హరిబాబు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతుండగా అప్పట్లో ట్రస్టును ఆశ్రయించడంతో సహకారం అందించామన్నారు. అయితే ఇటీవల అతను మృతి చెందిన విషయం తెలుసుకున్న ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు రూ.20 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఒక కుమార్తెను ట్రస్టు ద్వారా చదివిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉన్నారు.

బకాయిలు మంజూరు చేయించండి

చిల్లకూరు: విశ్రాంత ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే మంజూరు చేయించేలా కృషి చేయాలని నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులును విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఎస్ నారాయణరావు కోరారు. విజయనగరంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న నారాయణరావు విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి కరువు భత్యం చెల్లించేలా చూడాలని కోరినట్టు తెలిపారు. దీనిపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ శాసన మండలిలో అన్ని సమస్యలపై మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు నారాయణరావు తెలిపారు.

అకాల వర్ష సూచన.. రైతన్న ఆందోళన





ఆర బెట్టిన ధాన్యం పోగులు తోస్తున్న కూలీలు, పోగు తోసి పట్టలు కప్పిన ధాన్యం

- ధరలు లేక కళ్లాల్లోనే ధాన్యం
- అవస్థలు పడుతున్న రైతాంగం

చిట్టమూరు: వరి ధాన్యానికి సరైన ధరలు లేకపోవడంతో కళ్లాల్లోనే రాశులు పోసుకుని కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇలా అవస్థలు పడుతున్న పరిస్థితుల్లో మంగళవారం నెత్తిన పిడుగు పడేలా వాతావరణ శాఖ వర్ష సూచన హెచ్చరికలు జారీ చేసింది. దీంతోపాటుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో బీపీటీ5204(పెద్ద మసూరి) వరి వంగడాన్ని రైతులు ఎక్కువగా సాగు చేశారు. అయితే ఈ రకానికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టాలకు అమ్ముకోలేక ఎండలో ఆర బెట్టుకుని నిల్వ చేసుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఒక పక్క కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించకపోవడంతో దళారులు ఇష్టానుసారంగా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మేఘావృతం కావడంతో రైతులు వర్షం పడుతుందని ఆందోళనతో కూలీలను పెట్టి కళ్లాల్లో ఆర బెట్టిన ధాన్యాన్ని పోగులు పోసుకుంటున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిచి పోతుందని తల్లడిల్లిపోతున్నారు.

1.మండలంలో వరి సాగు విస్తీర్ణం 15 వేల హెక్టార్లు
2.గత సంవత్సరం బీపీటీ పుట్టు ధర రూ.22 వేలు
3. ఈ సంవత్సరం బీపీటీ పుట్టు ధర రూ.17 వేలు
4.గత సంవత్సరం ఎకరా దిగుబడి 45 బస్తాలు
5. ఈ సంవత్సరం ఎకరా దిగుబడి 35 బస్తాలు

జాతీయ కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థులు




క్రీడా దుస్తులు అందిస్తున్న హెచ్ఎం, పీఈటీలు

చిల్లకూరు: గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం భారతి మంగళవారం తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించి అభినందించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న జాషువా అండర్ -14 విభాగం, లోకేష్ అండర్-17 విభాగంలో మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. దీంతో వీరిని జాతీయ స్థాయిలో హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 20, 21 తేదీలలో జరిగే శుభ్ ఆరంభ్ ట్రోఫీ కబడ్డీ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

తడ: సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని అర్హుల జాబితాలో ఉన్న అభ్యర్థులకు కేటాయించిన బ్యాంకుల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూకి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. రుణాల కోసం మొత్తం 273 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 63 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి



వెంకటేశ్వర్లు, కమిషనర్

చిల్లకూరు: ప్రజల ఆరోగ్యాలను క్షీణింప చేసే ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి పురపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగి పోయి కాలుష్యం బారిన పడుతున్నారని అన్నారు. ఇంటి వద్దకు మున్సిపల్ సిబ్బంది వచ్చిన సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ఉంచి అందించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వ్యాపారులకు ఈ నెల 15 వరకు సమయం ఇస్తున్నామన్నారు. అటు తరువాత వాటిని విక్రయిస్తే వారిపై చర్యలు తప్పవని అన్నారు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

వెంకటగిరి రూరల్: పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా ఈ క్రాప్ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ సూచించారు. మండలంలోని కలపాడు ఆర్బీకే సెంటర్‌లో మంగళవారం ఈ పంట నమోదు సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈకేవైసీ నమోదు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతుల వివరాలను 9 నుండి 14వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభల ద్వారా రైతులకు చదివి వినిపిస్తామన్నారు.

సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి

రాపూరు: రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించడంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఏఓ సోమసుందర్ అన్నారు. రాపూరు మండలం కంబాలపల్లి, ఆదురుపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడడంతో రైతులకు ఖర్చు అధికమవుతుందన్నారు.